క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



ప్రత్తిపాడు: దాతల సహకారంతో రూ.4 కోట్లతో తొమ్మిది కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలను చేపట్టనున్నట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో గురువారం ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలాన్ని దానం చేసిన దివంగత నూతలపాటి పరమేశ్వరరావు కుటుంబాన్ని అభినందించారు. డల్లాస్‌లో తన స్నేహితుడైన ప్రకాశం జిల్లా వాసి డాక్టర్ సూదరగుంట రాఘవేంద్ర ప్రసాద్ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి రూ.4 కోట్లు సహాయం చేశారని.. వాటితో జిల్లాలో తొమ్మిది కమ్యూనిటీ హాల్స్‌ను బీసీ, ఎస్సీ, ముస్లిం మైనారిటీల కోసం నిర్మిస్తున్నామన్నారు. అందులో రెండు కమ్యూనిటీ హాల్స్‌ను ప్రత్తిపాడు నియోజకవర్గంలోనే నిర్మించనున్నామని చెప్పారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

గుంటూరు రూరల్: పాఠశాల ప్రారంభం సందర్భంగా కాకుమాను మోడల్ ప్రైమరీ స్కూల్‌లో గురువారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మండల విద్యాశాఖ అధికారి కేఎఫ్ కెనడీ పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శీలం అంకారావు మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యాన్ని విద్యార్థులందరికీ అందించినట్లుగా తెలియజేశారు. ఎంఈఓ విద్యార్థులతో పాటు మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి కొన్ని మెరుగైన సూచనలు చేశారు.

కొత్త రేషన్ కార్డు జారీలో సామాన్యులకు ఇబ్బందులు

పెదకాకాని: ప్రభుత్వం మొదలు పెట్టిన రేషన్ పాలసీ సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తోందని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ గురువారం అన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అందరికీ రేషన్ కార్డులు అందిస్తామని పత్రికల్లో అనేక సార్లు చెబుతున్నప్పటికీ వాస్తవ రూపం దాల్చట్లేదని ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. రేషన్ కార్డుల జారీలో మార్పు చేర్పుల్లో ఉన్న సాంకేతిక లోపం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కొత్త రేషన్ కార్డు జారీలో 300 కన్నా ఎక్కువ యూనిట్ల కరెంటు బిల్లును సాకుగా చూపి జారీ చేయట్లేదని ఆరోపించారు. ఈ విషయంలో ఉన్న సాంకేతిక సమస్యను వెంటనే పరిష్కరించి అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలని ఆయన ఆ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు కూటమి హామీల అమలుపై రాష్ట్రస్థాయి సమావేశం

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో విశ్వబ్రాహ్మణులకు నెరవేర్చాల్సిన హామీలపై రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం దువ్వాడ రైల్వే స్టేషన్‌లో రోడ్డు కూర్మన్నపాలెంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్వర్ణకారులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు, దేవస్థానాలలో మంగళసూత్రాలు, ఆభరణాల తయారీ హక్కుల్ని స్వర్ణకారులకు మాత్రమే ఇవ్వాలని, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి దాన్ని పరిశ్రమల శాఖ బదిలీ చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ప్రత్యేక నిధులు కేటాయింపుతో పాటు పలు అంశాలపై రాష్ట్రస్థాయి సమావేశం జరుగుతుందని తెలిపారు.

వాచ్‌మెన్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నెహ్రూనగర్: విద్యానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న ఈశ్వరరావుపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆయన గురువారం వాచ్‌మేన్‌ను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం రాత్రి ఈశ్వరరావు రూము ఎదురుగా అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్ ఓనర్ కారు డ్రైవర్ మద్యం తాగుతుండటాన్ని ప్రశ్నించినందుకు దాడి చేయడం బాధాకరమని తెలిపారు. దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

అప్పుల బాధతో టైలర్ ఆత్మహత్య

పట్నంబజారు: అనారోగ్య కారణాలతో అప్పులపాలై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూనుగుంట్ల వారి వీధిలో నివాసం ఉండే దుబ్బల సుబ్బారావు (56) లాలాపేటలోని వీఎస్ టైలర్స్‌లో టైలర్‌గా పని చేస్తున్నాడు. భార్య దుబాయిలో పనిచేస్తున్న నేపథ్యంలో షాపులో పని చేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. అనారోగ్య కారణంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై అప్పులు చేశాడు. మస్తాపానికి గురై గురువారం షాపులో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమార్తె దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త తరగతులకు పాత దుస్తులు

- సరఫరా కాని యూనిఫాం, బూట్లు
- తొలిరోజు ఆటలకే పరిమితమైన విద్యార్థులు
- తాగునీటి వసతి లేక విద్యార్థుల అవస్థలు



సాధారణ దుస్తుల్లో పాఠశాలకు వచ్చి ఆడుకుంటున్న విద్యార్థులు

పొన్నూరు: పొన్నూరులోని పాఠశాలల బడి గంట గురువారం ఉదయం మోగింది. దీంతో పునఃప్రారంభమైన పాఠశాలలకు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పరుగులు పెట్టారు. కొత్త తరగతుల్లోకి అడుగు పెడుతున్న చిన్నారులకు కూటమి ప్రభుత్వం యూనిఫాం, బూట్లు అందించలేదు. ఫలితంగా పాత దుస్తులతోనే విద్యార్థులు కొత్త తరగతుల్లో అడుగు పెట్టారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు' పేరుతో విద్యా సామగ్రి అందిస్తామని కూటమి ప్రభుత్వం గొప్పగా చెప్పుకొంది. కానీ ఆచరణలో మాత్రం విద్యార్థులకు అవి చేరలేదు.

అధికారుల పర్యవేక్షణ లోపం..

పట్టణ పరిధి పాత పొన్నూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు సుమారు 30 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి సరిపడా కిట్లు ఇప్పటికీ అందని పరిస్థితి నెలకొంది. 26 మందికే విద్యార్థి మిత్ర కిట్లు వచ్చాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కిట్‌లో పుస్తకాలు, బ్యాగు, బెల్టు మాత్రమే సరఫరా జరిగిందని పేర్కొంటున్నారు. ఇంకా బూట్లు, యూనిఫాం అందలేదని తెలిపారు. అయితే కిట్ల సరఫరాలో అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనబడుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

తాగునీరు లేక ఇబ్బందులు..

కార్పొరేట్ బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని ప్రభుత్వం చెప్పే మాటలు నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయి. విద్యార్థులకు శుద్ధ జలం అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడులో భాగంగా పాత పొన్నూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు నిరుపయోగంగా మారింది. పాఠశాలలోని బోరింగు పంపు మరమ్మతులకు గురై మూడు నెలలు దాటినా పట్టించుకునే నాథుడే లేరు. మున్సిపల్ కుళాయి నీరు ఆ బోరింగు పంపు ద్వారా ట్యాంకుకు చేరి ఆర్వో ప్లాంటుకు సరఫరా అయ్యి శుద్ధ జలం విద్యార్థులకు అందాల్సి ఉంది. అయితే బోరింగు పంపు మరమ్మతులకు నోచుకోక తాగునీటి సమస్య జఠిలంగా మారింది.



మరమ్మతులకు గురైన బోరింగు పంపు

తరగతి గదులు ఖాళీగా

పూర్తిస్థాయిలో పాఠశాలలకు సామగ్రిని తరలించామని విద్యాశాఖ అధికారులు చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. పాఠశాలలకు చేరిన కిట్లు కూడా అరకొరగా ఉండడం పట్ల తల్లిదండ్రుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలిరోజు విద్యార్థులు ఆటలతోనే సమయాన్ని గడిపారు. దీంతో పాఠశాలలోని తరగతి గదులు ఖాళీగా దర్శనమిచ్చాయి.



ఖాళీగా దర్శనమిస్తున్న తరగతి గదిలోని బల్లలు

చెత్తను క్లాప్ మిత్రలకు అందించాలి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: చెత్తను రోడ్ల వెంబడి పడేయకుండా డస్ట్ బిన్‌లలో ఉంచి క్లాప్ మిత్రలకు అందించాలని డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలో గురువారం ఉపాధి హామీ పథకం కూలీలు పనులు నిర్వర్తిస్తున్న ప్రాంతాలకు ఆయన వెళ్లి వారికి తడి చెత్త, పొడి చెత్త, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ.. ఇళ్ల నుంచి ఉత్పన్నమవుతున్న వ్యర్థాలను ఇంట్లోనే తడి, పొడి చెత్తలను వేరు చేసి ఉంచాలన్నారు. క్లాప్ మిత్రలు ఇంటికి వచ్చినప్పుడు డస్ట్‌బిన్‌లను వేర్వేరుగా అందించాలి సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతని చెప్పారు. డీపీఆర్‌సీ ఆర్పీలు నిరంజన్, అనూరాధ, ఐటీసీ ఫినిష్ సొసైటీ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.

ఆటపాటలతో ప్రీస్కూల్ విద్య



యాదవపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను పరిశీలిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు: చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నామని ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు సీడీపీవో జి.విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసాలు, అయిదేళ్లు నిండిన చిన్నారులను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేందుకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు యాదవపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అడిషనల్ సీడీపీవో సీహెచ్ విజయనిర్మల, సూపర్‌వైజర్ ఎస్.భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక రామానగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు తల్లుల సమక్షంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త, ఫోరం ఫర్ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అండ్ మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి.జ్యోతిరాణి ఆధ్వర్యంలో చిన్నారులతో పలకలపై అ, ఆలు దిద్దించారు. కార్యక్రమంలో హెల్పర్ షేక్ కరిమూన్, తల్లులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి, పక్కన సూపర్‌వైజర్లు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా జి.విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీడీపీవోగా విధులు నిర్వహించిన వి.సుజాతదేవి ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చేయడంతో అడిషన్ సీడీపీవో సీహెచ్ విజయనిర్మలకు ప్రాజెక్టు బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో సాధారణ బదిలీల్లో భాగంగా బాపట్ల జిల్లా అమృతలూరు ప్రాజెక్టు సీడీపీవోగా పని చేస్తున్న విజయలక్ష్మి ప్రత్తిపాడుకు బదిలీ అయ్యారు. అదే విధంగా ముగ్గురు సూపర్‌వైజర్లు మండలానికి బదిలీపై వచ్చారు. వీరికి ఉన్నతాధికారులు సెక్టార్‌లను కేటాయించారు. ఫిరంగిపురం ప్రాజెక్టు నుంచి వచ్చిన టి.హేమలత భాస్కర్‌కు వట్టిచెరుకూరు సెక్టారు.. పొన్నూరు ప్రాజెక్టు నుంచి వచ్చిన కె.ప్రేమలతకు పాండ్రపాడు సెక్టారు.. నాదెండ్ల ప్రాజెక్టు నుంచి వచ్చిన ఎ.ఉషారాణికు వరగాని సెక్టారు అప్పగించగా వారు బాధ్యతలు స్వీకరించారు.

పైపు లైన్ నిర్మాణ పనులు ప్రారంభం



సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద జరుగుతున్న నూతన పైపులైన్ పనులు

నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్‌ఎల్‌ఆర్(లక్ష్మీపురం) వాటర్ ట్యాంకులకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్ పనులు సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద జరుగుతున్నాయి. గతంలో నెహ్రూనగర్ నుంచి హెచ్‌ఎల్‌ఆర్‌కు 800 ఎం.ఎం. డయా పైపులైన్‌పై తాగునీటిని సరఫరా చేసేవారు. పైపులైన్ దశాబ్దాలు తరబడినది కావడంతో తరుచు లీకులు ఏర్పడుతూ తాగునీరు వృథా అయ్యేది. దీనికి ప్రత్యామ్నాయంగా గత ప్రభుత్వ హయాంలో 800 ఎం.ఎం. డయా పైపులైన్‌కు బదులు 900 ఎం.ఎం. డయా పైపులైన్ వేశారు. సంజీవయ్యనగర్ రైల్వే గేటు పరిసర ప్రాంతాల్లో పైపులైన్ వేసేందుకు కొన్ని అంతరాలు రావడంతో ఆ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం ఆ పనుల్ని పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు కార్యాచరణ సిద్ధ చేశారు. మరో వారం రోజుల పాటు ఈ పనులు జరుగుతుంటాయని, వాహనదారులు గమనించి సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయ రైతుకు అవార్డు



అవార్డు అందజేస్తున్న మంత్రి అచ్చెంనాయుడు, వీసీ డాక్టర్ శారదజయలక్ష్మిదేవి

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయ మహిళా రైతును ఉత్తమ రైతు అవార్డు వరించింది. ఫిరంగిపురం మండలం మెరికపూడి గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు జమ్ముల కృష్ణవేణికి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ ఫౌండేషన్‌డే వేడుకల్లో వి.రామచంద్రరావు పేరుపై ఉత్తమ రైతు అవార్డును గురువారం అందించారు. వేడుకల్లో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంన్నాయుడు చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేశారు. దీంతో పాటు రూ.25 వేల నగదు, మెమెంటో, సర్టిఫికెట్ అందజేశారు. మహిళా రైతు కృష్ణవేణి ప్రకృతి వ్యవసాయం చేస్తూ మిరప, పత్తి కూరగాయలు పండిస్తున్నారని.. కూరగాయలను మునగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సరఫరా చేస్తారని ప్రకృతి వ్యవసాయ డీపీఎం రాజకుమారి తెలిపారు. అవార్డును పొందిన రైతును విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, తోటకూర శ్రీనివాస్, వాసంతి, తదితరులు అభినందించారు.

అనూష మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి



నెహ్రూనగర్: రజక మహిళ తోరటి అనూష మరణానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రజక వృత్తి ధోబీ ఘాట్ల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని ఆర్టీసీ కాలనీ వద్ద గురువారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షులు చెన్నూరి చెన్నయ్య మాట్లాడుతూ అనూష మరణానికి కారణమైన ఆమె భర్త, అతనికి సహకరించిన వారిపై హత్యా నేరంపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని మే 25న కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశామని తెలిపారు. సదరు ఫిర్యాదును పరిశీలించాలని డీఎంహెచ్‌ఓకు కలెక్టర్ సిఫార్సు చేశారన్నారు. మే 29న సమస్యను పరిష్కరించనట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు నిరాహార దీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమితి జిల్లా గంజరపల్లి వీరాంజనేయులు, వడ్డెర సంఘం నాయకులు ఉప్పుతాళ్ల శ్రీనివాసరావు, కొండూరు శివ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు టెక్నాలజీ అందుబాటులో ఉండాలి



ప్రొసీడింగ్ పుస్తకావిష్కరణలో సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ సల్మాన్ అబ్దుల్ మోయిజ్

చేబ్రోలు: పేదవారికి, గ్రామీణ ప్రాంతాల వారికి టెక్నాలజీ అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ సల్మాన్ అబ్దుల్ మోయిజ్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'సెకండ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నెట్‌వర్క్స్ అండ్ సాఫ్ట్ కంప్యూటింగ్' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ముందుగా కాన్ఫరెన్స్‌కు సంబంధించిన ప్రొసీడింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సల్మాన్ అబ్దుల్ మోయిజ్ మాట్లాడుతూ.. వ్యక్తిగత డేటా ఎలా సురక్షితంగా నిల్వ చేయాలి.. ఎలా ఉపయోగించాలి అనే అంశపై వివరించారు. హైదరాబాద్‌లోని టీసీఎస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ బాల ప్రసాద్ పెద్ది మాట్లాడుతూ.. ట్రాఫిక్ పరిస్థితులు, జీపీఎస్ సమాచారం, రోడ్డు భద్రతను విశ్లేషించి తగిన నిర్ణయాలు తీసుకోవడంలో ఏజెంటిక్ ఏఐ కీలకంగా పనిచేస్తుందన్నారు. హైదరాబాద్‌లోని టెక్ క్యూబ్స్ ఏఐ అండ్ కన్సల్టంట్స్ సీఈవో సునీల్ కుమార్ మాట్లాడుతూ.. హెచ్‌ఆర్, ఫైనాన్స్, సప్లై చైన్, కస్టమర్ సర్వీస్–సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డి.వి జయరాము, డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత



పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

పెదకాకాని: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం పెదకాకాని పోలీస్‌స్టేషన్‌లో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిస్టర్ విద్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ 14 ఏళ్లలోపు బాల బాలికలను ఏ పనిలోనూ పెట్టుకోకూడదన్నారు. ఎవరైనా బాలలు షాపులు, హోటళ్లలో పని చేస్తే వారిని పనిలో పెట్టుకున్న వారు శిక్షార్హులు అవుతారన్నారు. బాలలు బడిలో కాకుండా ఎవరైనా బడి బయట ఉంటే వారిని గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకట్రావు, జె.ఇజ్రాయెల్, బి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు

శంకర్ విలాస్ సెంటర్‌లో ఏఐటీయూసీ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

లక్ష్మీపురం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయరాదని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శంకర్ విలాస్ సెంటర్‌లో ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపులో భాగంగా జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ అధ్యక్షతన గురువారం నేతలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అని తెలిపారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికుల్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడం అంటే ఆంధ్ర రాష్ట్రానికి తీరని ద్రోహం చేసినట్లేనని పేర్కొన్నారు. ఏఐటీయూసీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడుతూ ఉక్కు కర్మగార స్థాపన కోసం నాటి యువకులు, ప్రజలు ఉద్యమాలు నిర్వహించారో నేడు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అంతకు రెట్టింపు పోరాటాలు చేయవలసిన ఆవశ్యకత ఉందని పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో యువకులు, విద్యార్థులు, మేధావులు, ప్రజలు పెద్దఎత్తున భాగస్వామ్యం అవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ఆటో వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు కూరాకుల రాంప్రసాద్, పలు యూనియన్ , సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

డీఎస్పీ అబ్దుల్ అజీజ్



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు: సమాజంలో మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ లోన తిక్కన సమావేశ మందిరంలో ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో గురువారం మత్తు పదార్థాల అనర్థంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అజీజ్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. కళాశాల, బయట యువత చెడు స్నేహాల ద్వారా పెడతోవ పట్టే అవకాశం ఉందని తెలిపారు. యువత ఉన్నత ఆశయాలతో భవిష్యత్తుకు కృషి చేయాలని చెప్పారు. ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ మాట్లాడుతూ కార్మికులు సైతం చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో మద్యం తాగడం వల్ల ప్రయాణికుల ప్రాణాల మీదకు వస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. పాత గుంటూరు పీఎస్ ఎస్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతామని, విక్రయించే వారిపై చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు చేపట్టి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. సమావేశంలో ఈగల్ బృందం సభ్యులు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలలతో పని చేయిస్తే చట్టరీత్యా నేరం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ గురవయ్య తదితరులు

పట్నంబజారు: బాలలతో పని చేయిస్తే చట్టరీత్యా నేరమని 21వ డివిజన్ కార్పొరేటర్ కె.గురవయ్య అన్నారు. జిల్లా చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్, క్రాప్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. నగరంలోని 21వ డివిజన్ పరిధిలోని కొండా వెంకటప్పయ్య కాలనీలో బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంపై అవగాహన ర్యాలీని ర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ కె.గురవయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడుతూ బాలలు పాఠశాలల్లో ఉండేలా వార్డు బాలల సంక్షేమ రక్షణ కమిటీ చూడాలని తెలిపారు. కొల్లి శారద రౌండ్ టేబుల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదరికం , నిరక్షరాస్యత, సామాజిక అసమానతలు, బాలల చట్టాలపై అవగాహన లేకపోవడం వల్లే బాలకార్మిక వ్యవస్థ ఏర్పడుతోందని పేర్కొన్నారు. బాలకార్మిక వ్యవస్థను అంతమొందించే వరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాప్ జిల్లా కోఆర్డినేటర్ జి.వెంకట్ మాట్లాడుతూ బాలకార్మికులతో పనులు చేయిస్తున్నట్లు గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబరు డయల్ 100, 1098కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు క్రాప్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో సంచారచంద్రన్న ప్రోగ్రామ్‌లో భాగంగా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు శాంతి 97మందికి వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారపు జాగ్రత్తల గురించి వారికి వివరించారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ గుంటూరు 1వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P No.37/2021 in O.S. No.260/2016

షేక్ మస్తాను వలి ..జడ్జిమెంటు హోల్డరు

మరియు

మోపర్తి భాస్కర రావు ..జడ్జిమెంట్ డేటర్

[illegible] 03-07-2025 తేదీన ఉదయం 10-30 [illegible]

[illegible]

షెడ్యూలు ఆస్తి : గుంటూరు జిల్లా, పెదకాకాని [illegible] Sy.No.26/B1A1లో [illegible] 1/3 వ వంతు భాగములో ¼ వ వంతు మాత్రమే (1/3 X ¼ = 1/12 వ వంతు) పరియగు 201.75 చదరపు గజములు [illegible]

తూర్పు : [illegible]

దక్షిణము : మోపర్తి [illegible]

పడమర : మోపర్తి వెంకట రావు [illegible]

ఉత్తరము : [illegible]

JDRకు హక్కు కలిగిన 1/3 వ వంతు సుమారు 0.16.66 సెంట్ల భూమిలో ¼ వ వంతు సుమారు 201.75 చదరపు గజములు DHR's [illegible] రూ.2,00,000/-

JDRకు హక్కు కలిగిన 1/3 వ వంతు సుమారు 0.16.66 సెంట్ల భూమిలో ¼ వ వంతు సుమారు 201.75 చదరపు గజములు కోర్టు [illegible] రూ.5,00,000/

[illegible] వెంకట రెడ్డి, M.A, LL.M

[illegible] B.A, B.L

వాది తరఫు న్యాయవాదులు, గుంటూరు.

సెల్ : 9397076226.